సాక్షి
తిరుపతి
శనివారం : 15 : జూన్ : 2024



ఆగి ఉన్న కారును ఢీకొన్న లారీ

జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న కారును లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. IIలో



వసతులు నిల్..వసూళ్లు ఫుల్

రేణిగుంట సంతలో నిర్ణీత రేట్లకంటే అధిక మొత్తంలో కాంట్రాక్టర్లు వసూలు చేస్తుండడం విమర్శలకు తావిస్తోంది. IIలో



టైరు బండిని ఢీకొన్న లారీ

నూళ్లూరుపేట పట్టణంలో టైరు బండిని లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఓ ఎద్దు అక్కడికక్కడే మృతిచెందింది. IIలో

న్యూస్‌రీల్

ఐఐటీలో ఓపెన్ హౌస్ రేపు

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక రెవెన్యూలో ఉన్న ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో ఆదివారం ఓపెన్ హౌస్ కార్యక్రమం ఉంటుందని డైరెక్టర్ కేఎన్.సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భావి విద్యార్థుల కోసం జేఈఈ అడ్వాన్స్ 2024లో అర్హత పొందిన విద్యార్థులతో ఇంటరాక్టివ్ సెషన్ జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో అకడమిక్ ప్రోగ్రాంలు, క్యాంపస్ అభివృద్ధి, విద్యార్థుల జీవిత అవలోకాన్ని పొందవచ్చని తెలిపారు. సెషన్ ప్రధానంగా ఇన్‌స్టిట్యూట్ అండర్ గ్రాడ్యుయేట్ పాఠ్యాంశాలు, డ్యూయల్ డిగ్రీలు, బ్రాంచి మార్పు విధానం, హాస్టల్ మౌలిక, ఆరోగ్య సౌకర్యాలు, విద్యార్థి కేంద్రీకృత సమాచారం ఉంటుందని వెల్లడించారు.

పెండింగ్ పనులు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి అర్బన్: వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వైజాగ్–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధిలో భాగమైన 7 ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లకు నీటి సరఫరా పనులు, భూసేకరణ, ఆక్రమణల అంశాలపై వీసీఐసీ, రెవెన్యూ, నేషనల్ హైవేస్ పీడీ, ఆర్‌అండ్‌బీ తదితర శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మీ పరిధిలో సమస్య లుంటే తమ దృష్టికి తీసుకొస్తే వాటికి పరిష్కారం చూపుతామన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి పెంచలకిషోర్, జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేష్, గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్, జిల్లా ఆర్‌అండ్‌బీ అధికారి మధుసూదన్‌రావు, ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నరసింహులు, స్పెషల్ ప్రాజెక్ట్ జోన్ జెడ్‌ఎం విజయరత్నం, డిప్యూటీ జెడ్‌ఎం చంద్రశేఖరయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న వర్షాలు

తిరుపతి అర్బన్: జిల్లాలో కొన్ని రోజులుగా ఓ మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. ఖరీఫ్‌లో పంటలు సాగుచేస్తున్న రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బీడు భూములు సైతం సాగులోకి వచ్చేస్తున్నాయి. ప్రధానంగా వరి పంటతోపాటు వేరుశనగ, సజ్జ, రాగులు, చిరు ధాన్యాలు, కూరగాయల పంటలు సాగులో ఉన్నాయి. ఈ వర్షాలు సాగులోని పంటలకు ఎంతో ప్రయోజనం కలిగించనున్నాయి. శుక్రవారం జిల్లాలో 24.మి.మీ వర్షపాతం నమోదైనట్టు సంబంధిత అధికారులు తెలిపారు. నారాయణవనంలో 6.8 మి.మీ, పిచ్చాటూరులో 5.4, నాగలాపురంలో 4.4, చంద్రగిరిలో 4.2, చిన్నగొట్టిగల్లు 1.8, పుత్తూరులో 1.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్టు వెల్లడించారు.

యూపీఎస్సీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు



తిరుపతి అర్బన్: యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో పరీక్షల నిర్వాహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీన (ఆదివారం) నిర్వహించనున్న ఈ పరీక్షకు జిల్లాలో 11 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ పరీక్షలకు 5,518 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్టు వెల్లడించారు. తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో ఈ నెల 15, 16 తేదీల్లో కంట్రోల్ రూమ్స్‌కు 9000665565, 9676928804 ఉంటాయని, ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని సూచించారు. ఈ పరీక్షలకు అబ్జర్వర్‌గా జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యాన్‌చంద్ర వ్యవహరిస్తారని చెప్పారు. తిరుపతి ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి పరీక్ష పేపర్ల కస్టోడియన్‌గా వ్యవహరించనున్నట్టు వెల్లడించారు. ఆదివారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటలకు, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు రెండు సెషన్లల్లో పరీక్ష జరుగుతుందన్నారు. 30 నిమిషాల ముందే పరీక్ష కేంద్రాల ప్రధాన గేట్లు మూసివేస్తారని.. ఆపై ఒక్క నిమిషం ఆలస్యం అయినా అనుమతి ఉండదని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, యూపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.

వేటకు వేళాయె

వేట నిషేధిత గడువు శుక్రవారం అర్ధరాత్రితో ముగిసింది. 61 రోజుల విరామం తర్వాత శనివారం తెల్లవారు జామున సముద్రంలో చేపల వేట పునఃప్రారంభంకానుంది. ఉమ్మడి నెల్లూరు జిల్లా సముద్రతీరంలో మత్స్యకారులు తమ వేట సామగ్రిని సంసిద్ధం చేసుకుంటున్నారు. వేటకు బయలుదేరే ముందు మత్స్యకారులు ఒకరినొకరు పలకరించుకోవడం, ఒడ్డున కూర్చుని మత్స్య సంపద దొరికే ప్రదేశాలపై చర్చించుకోవడం, ఇష్ట దైవం గంగమ్మతల్లిని ప్రార్థించుకోవడం, కుటుంబ సభ్యుల నుంచి ఆశీస్సులు తీసుకోవడం ఇలా సముద్ర తీరంలో సందడి వాతావరణం నెలకొంది.





సూర్యోదయం వేళ వేటకు బయలుదేరుతున్న మత్స్యకారులు (ఫైల్)

వాకాడు: ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఏప్రిల్ 14 నుంచి జూన్ 15వ తేదీ వరకు చేపల పునరుత్పత్తి సమయం కావడంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వేట నిషేధం అమలవుతోంది. ప్రభుత్వ ఆదేశాలకు కట్టుబడి రెండు నెలలుగా వేట లేక ఖాళీగా ఉన్న మత్స్యకారులు ఆకలితో అలమటించారు. శనివారం వేకువజాము నుంచి మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు బయలుదేరి వెళ్లనున్నారు.

41 వేల మంది మత్స్యకారులు

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 12 తీర ప్రాంత మండలాలు ఉన్నాయి. 169 కి.మీ మేర సముద్ర తీరం ఉంది. తీరం వెంబడి 114 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. అందులో 1.5 లక్షల మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. 3.1 లక్షల మంది జనాభా ఉన్నారు. దాదాపు 41 వేల మంది మత్స్యకారులు చేపల వేటనే ఆధారంగా చేసుకుని జీవిస్తున్నారు. ఏడాదిలో 10 నెలల వేట ద్వారా 52 వేల టన్నుల మత్స్య సంపదను సేకరిస్తున్నారు.

సర్వత్రా ఉత్కంఠ

ప్రభుత్వ ఆదేశాలకు కట్టుబడి 61 రోజులపాటు వేట లేక ఖాళీగా ఉన్న మత్స్యకారులకు గత ప్రభుత్వం నాలుగేళ్లపాటు రూ.10 వేల చొప్పున ఒక్కో మత్స్యకారునికి మత్స్యకార భరోసా అందించింది. వేట నిషేధం ప్రకటించిన రోజునే ఆ పరిహారాన్ని వారి బ్యాంక్ ఖాతాల్లోకి నేరుగా జమచేసింది. 2014లో అధికారం చేపట్టిన టీడీపీ వేట విరామ పరిహారాన్ని రూ.4 వేలు వెచ్చించగా.. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆ మొత్తాన్ని రూ.10 వేలకు పెంచింది. ఇప్పుడు మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడంతో మత్స్యకార భరోసాపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని ఉత్కంఠ నెలకొంది. మేనిఫెస్టోలో చెప్పినట్టు రూ.20 వేలు ఇవ్వాలని పలువురు మత్స్యకారులు కోరుతున్నారు.

మత్స్యకారుల వేట సాగేదిలా..

మత్స్యకారులు రోజూ రాత్రి భోజనమయ్యాక కొన్ని గంటలు భార్య పిల్లలతో ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటారు. ఆ తర్వాత అర్ధ రాత్రి ఒంటి గంటకు భార్యాబిడ్డలను వదిలి మత్స్యకారులు ఒకరినొకరు పలకరించుకుంటూ ఒకచోట గ్రూపుగా ఏర్పడి తమ వేట సామగ్రితో సముద్రం ఒడ్డుకు చేరుకుంటారు. కొంతసేపు మత్స్యకారులు సముద్రం ఒడ్డున చిమ్మచీకట్లో కూర్చుని మత్స్య సంపద దొరికే ప్రదేశ దిశలపై చర్చించుకుంటారు. అందరూ ఒకే మాటకు కట్టుబడి వేటకు బయలుదేరుతారు. వేటకు బయలుదేరే ముందు తమ ఇష్ట దైవాన్ని తలుచుకుని సముద్రంలోకి వెళ్తారు. వీరికి సముద్రం ఒడ్డు వరకు కుటుంబ సభ్యులు వచ్చి సాగనంపుతారు. వీరు వచ్చే వరకు సముద్రం ఒడ్డున గంపలతో ఎదురు చూస్తుంటారు. సాధారణ వల వేటకు ముగ్గురు, రింగు వల వేటకు ఏడుగురు, వంజిరం వల వేటకు 10 మంది మత్స్యకారులు వేటకు బయలు దేరుతారు. బయలుదేరిన బోట్లు సుమారు 5 కి.మీ నుంచి 16 కి.మీ వరకు సముద్రం లోపలికి వెళ్లి వేట కొనసాగిస్తాయి. చేపలు పుష్కలంగా దొరికే వరకు ఒక రోజు నుంచి వారం రోజులు వరకు వేటాడి తిరిగి ఒడ్డుకు చేరుకుంటారు. వీరు తెచ్చిన చేపలను మత్స్యకారుల అందరూ సమానంగా పంచుకుంటారు. తర్వాత ఆయా కుటుంబాల మహిళలు గంపల్లో తీసుకుని సమీప గ్రామాల్లో తిరిగి విక్రయిస్తుంటారు. అధిక మోతాదులో దొరికిన చేపలను కేరళ, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాలకు చెందిన దళారీలకు వేలం పాటల ద్వారా విక్రయిస్తుంటారు. ఒకవేళ వేట సాగకపోతే వచ్చిన నష్టాన్ని అప్పులు చేసి సమానంగా భరిస్తారు. ప్రస్తుతం ప్రకృతి విపత్తుల కారణంతోనే సముద్ర జలాలు కాలుషితమై మత్స్య సంపద తగ్గిపోతోంది. ఒక్కో సారి రోజుల తరబడి వేటాడినా తగినంత మత్స్య సంపద లభించక, మత్స్యకారులకు పూట గడవని పరిస్థితి ఏర్పడుతుంది. మత్స్యసంపద దొరికినా అంతర్ రాష్ట్రాల చేపల వ్యాపారులు సిండికేటుగా ఏర్పడి తక్కువ ధరకు దోచుకుపోవడంతో మత్సకారులు ఆర్థికంగా చికితికిపోతుంటారు. ప్రకృతి వైపరీత్యాలతోపాటు, మర వల జోరుతో చేపల వేట కష్టంగా మారింది.



చిమ్మ చీకట్లో కూర్చుని మత్స్యసంపదపై చర్చించుకుంటున్న గంగపుత్రులు



కొండూరుపాళెం వద్ద వేటకు సిద్ధంగా ఉన్న బోట్లు



మత్స్యసంపద కోసం ఎదురు చూస్తున్న కుటుంబ సభ్యులు

జాగ్రత్తలు పాటించాలి



61 రోజుల తర్వాత వేటకు బయలుదేరుతున్న మత్స్యకారులు అందరూ జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. ప్రతి ఒక్కరూ మంజూరు చేసిన గుర్తింపు కార్డులు వెంట తీసుకెళ్లాలి. అలాగే కొత్తగా బోట్లు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు ఆయా పత్రాలు వెంట తీసుకుపోవాలి. సముద్రంపై ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు తారసపడితే వెంటనే తెలియజేయాలి. మెరైన్ పోలీసులకు అందరూ సహకరించాలి.

– రాజేష్, ఏడీ మత్స్యశాఖ గూడూరు

ఇంకా పరిహారం రాలేదు



గత నాలుగేళ్లుగా పరిహారం అందించారు. ఐతే ఈ ఏడాది ఇంకా పరిహారం ఇవ్వలేదు. ఐదోసారి పరిహారం అందించే సమయానికి ఎన్నికల కోడ్ రావడం దృష్టకరం. 61 రోజుల పాటు ఎలాంటి ఉపాధి లేక జీవనం కొంచెం కష్టంగా మారింది. కొందరు పూట గడవక పస్తు లుంటున్నారు. వేట విరామ సమయంలో మత్స్యకారులకు ప్రభుత్వ సాయం సకాలంలో అందిస్తే బాగుంటుంది.

–మునస్వామి, మత్స్యకారుడు, ఓడపాళెం

ఇష్టదైవానికి పూజలు చేశాం



సముద్రపై వేట సజావుగా సాగాలని గంగమ్మ తల్లికి ముందుగానే ప్రార్థనలు చేశాం. ఈ సారి సముద్రంలో మత్స్య సంపద పుష్కలంగా దొరకాలని, దొరికిన చేపలకు మంచి ధర రావాలని కోరుకున్నాం. వేట విరామ పరిహారంపై కొత్త ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అనుమానంగా ఉంది. ఈ ఏడాది డబ్బులు ఇస్తారో లేదో తెలియడం లేదు.

–పోలయ్య, మత్స్యకారుడు, కొండూరుపాళెం

పుష్పాభిషేకం



గోవిందరాజస్వామివారి ఆలయంలో శాస్త్రోక్తంగా పుష్పయాగం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో శుక్రవారం స్వామి వారి పుష్పయాగం కన్నుల పండువగా సాగింది. ఉదయం 9.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి వారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం చేపట్టారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకం చేశారు. అనంతరం ఆలయంలో మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అర్చకుల వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి పుష్పయాగం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో మల్లెలు, రుక్షి, కనకాంబరాలు, చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, రోజా, కలువలు వంటి 12 రకాల సంప్రదాయ పుష్పాలు, తులసి, మరువం, దవణం, బిల్వం, పన్నీరాకు పత్రాలను కలిపి మొత్తం మూడు టన్నులతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజ స్వామి వారికి పుష్పయాగం చేశారు. ఈ పుష్పాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి దాతలు విరాళంగా అందజేశారు. కాగా సాయంత్రం 6.30 గంటలకు స్వామి, అమ్మవార్లు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, ఉద్యానవన విభాగం డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, గార్డెన్ మేనేజర్ జనార్దన్‌రెడ్డి, ఏఈవో మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ



మొక్కను నాటుతున్న డీఈఓ శేఖర్

తొట్టంబేడు: పర్యావరణాన్ని పరిరక్షించుకుంటేనే మానవ మనుగడ సాఫీగా సాగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ శేఖర్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తి మండలం, ఊరందూరు ఉన్నత పాఠశాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ సహజ వనరులను పరిరక్షించాల్సిన బాధ్యతను విద్యార్థులు గుర్తెరిగి మసలుకోవాలని కోరారు. పాఠశాలలో గత ఏడాది పదోతరగతి పరీక్ష ఫలితాల వివరాలను అడిగి తెలుసుకున్న ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య, ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి, ఉపాధ్యాయులు సురేష్, రమేష్‌బాబు, శాంతి, శ్రీనివాసులు, రజియా, వరలక్ష్మి, సుమతి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

వైభవంగా అర్జున తపస్సుమాను



పురవీధుల్లో ఊరేగుతున్న స్వామివారు



అర్జున తపస్సుమాను ఎదుట సంతానం కోసం వరపడ్డ మహిళలు

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్జున తపస్సుమాను వైభవంగా జరిగింది. ఉదయం స్వామి,అమ్మవార్ల విగ్రహాలకు విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. తపస్మాన్ కోసం ఆలయం ముందు తాటిచెట్టును ఏర్పాటు చేశారు. సంతానప్రాప్తి కోసం మహిళలు స్నానాలాచరించి భక్తిశ్రద్ధలతో తపస్సుమాను వద్ద వరబడ్డారు. అనంతరం అర్జున వేషధారి పద్యాలు, పాటలు పాడుతూ తపస్మాన్ ఎక్కాడు. చెట్టు పైభాగాన తమ వెంట తీసుకుని వెళ్లిన నిమ్మకాయలు, పసుపు, కుంకమ, విభూది తదితర సామగ్రికి పూజలు నిర్వహించారు. నిమ్మకాయలు, విభూదిని తపస్మాన్ చెట్టు పైభాగం నుంచి భక్తులపైకి చల్లారు. వాటి కోసం భక్తులు ఎగబడ్డారు. మధ్యాహ్నం సుమారు. 1,500 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్తర గోగ్రహణంలో అర్జునుడు ఆవుల మళ్లింపు కార్యక్రమం జరిగింది. రాత్రి కీచకవధ వీధినాటకం నిర్వహించారు. స్వామివారి విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మునిరంగారెడ్డి, ఆలయ చైర్మన్ మాధవరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నంరెడ్డి, ఆలయ పూజారి రవి తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై చిద్విలాసం

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అభిషేకానంతరం అమ్మవారిని పట్టుపీతాంబరాలు, వజ్రవైఢూర్యాలతో అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఆలయంలోని శ్రీకృష్ణ ముఖమండపంలో పాంచరాత్ర ఆగమోక్తంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలోని అలంకార మండపం వద్ద విద్యుత్ కాంతుల నడుమ అమ్మవారికి ఊంజల్ సేవను కనుల పండువగా పూర్తిచేశారు. తదుపరి సర్వాలంకారభూషితురాలైన అమ్మవారు బంగారు తిరుచ్చిపై ఆశీనులై నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.



బంగారు తిరుచ్చిపై భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

18న ఐటీఐలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 18వ తేదీన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ వీ.శ్రీలక్ష్మి తెలిపారు. ఈ డ్రైవ్‌కు తిరుపతి జిల్లాలోని వివిధ కంపెనీల ప్రతినిధులు పాలొని ఉద్యోగాలకు ఎంపిక చేస్తారన్నారు. ఐటీఐ పాసైన అభ్యర్థులు అర్హులని, ఆసక్తి గలవారు 18వ తేదీ ఉదయం 9గంటలకు బయోడేటా, పది మార్కుల లిస్ట్, ఐటీఐ ప్రొవిజినల్ జిరాక్స్ కాపీలు, ఆధార్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరవ్వాలన్నారు. 94416 65290, 96764 86678 నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

వసతులు నిల్.. వసూళ్లు ఫుల్

- వారపు సంతలో నిర్ణీత ధరలకు మించి వసూళ్లు
- చోద్యం చూస్తున్న పంచాయతీ అధికారులు


కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న రేణిగుంట వారపు సంత


సంత ప్రాంగణంలో ఆరబెట్టిన ఎండు చేపలు

రేణిగుంట: రేణిగుంట వారపు సంత జిల్లాలోనే ఎండు చేపల విక్రయానికి ఎంతో ప్రాచుర్యం పొందింది. ప్రతి శనివారం జరిగే ఈ సంతకు జిల్లా నుంచే కాకుండా నెల్లూరు జిల్లా నుంచి, అటు పొరుగు రాష్ట్రం తమిళనాడు నుంచి ఎక్కువమంది వస్తుంటారు. సంతలో కనీస సౌకర్యాలను గాలికొదిలేసిన పంచాయతీ అధికారులు తమ సరుకులను విక్రయించుకునే వారి వద్ద నిర్ణీత ధరల కంటే అధికంగా వసూలు చేస్తున్నారు. దీంతో మదనపల్లి, తమిళనాడు వంటి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారులు తీవ్ర ఇక్కట్లపాలవుతున్నారు. సంత ప్రాంతంలోనే పంచాయతీ నోటీసు బోర్డులో ఓ ధర ఉంటే దానికంటే అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

వసతులు పూజ్యం

రేణిగుంట సంతలో ప్రతివారం వేలాది మంది ప్రజలు జనం వస్తుంటారు. అయితే సంతలో కనీస సౌకర్యాలు కల్పించలేదు. కనీసం టార్పాలిన్ పట్టలు కూడా కట్టని పరిస్థితి. సంత ద్వారా ఏటా అత్యధిక ఆదాయం పొందుతున్న పంచాయతీ అధికారులు సంతలో వసతులను కల్పించకపోవడం విమర్శలకు తావిస్తోంది. మహిళలు అధికంగా వచ్చే ఈ సంత ప్రాంగణంలో కనీసం ఒక్క మరుగుదొడ్డీ లేదు. తాగునీటి సౌకర్యం అంతకన్నా లేదు. కొద్దిపాటి చినుకులు పడినా ఆ రోజు సంతలో తెచ్చుకున్న కూరగాయలు అమ్ముకునేందుకు చిరు వ్యాపారులు నానా అవస్థలు పడాల్సిందే. కూరగాయలు కొనేందుకు వచ్చే వారు కూడా తల దాచుకోవడానికి నిలువనీడ లేని పరిస్థితి. అయితే సంత గేటు వసూలు చేసే కాంట్రాక్టరు మాత్రం పట్టికలోని నిర్ణీత ధరలను వసూలు చేయకుండా అధికంగా వసూలు చేస్తున్నారు. అన్నీ తెలిసినా పంచాయతీ అధికారులు మౌనం దాల్చడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై సంబంధిత అధికారులను వివరణ అడిగేందుకు ప్రయత్నించగా వారు అందుబాటులోకి రాలేదు.

క్లుప్తంగా

రేపటి నుంచి సప్తగిరి సంగీత సప్తాహం


మాట్లాడుతున్న పున్నమరాజు మురళీకృష్ణ

తిరుపతి కల్చరల్: మనోవికాస్, మానసిక దివ్యాంగుల ప్రత్యేక ఆశ్రమ పాఠశాల, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 23వ తేదీ వరకు నిరంతరాయంగా సప్తగిరి సంగీత సప్తాహ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు మనోవికాస్ ప్రతినిధి, నిర్వాహకుడు పున్నమరాజు మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. యశోధనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో ఏడు రోజుల పాటు సాగే ఈ సప్తగిరి సంగీత సప్తాహ కార్యక్రమానికి దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచేగాక సింగపూర్, యూఎస్‌ఏ వంటి దేశాల నుంచి కూడా ప్రముఖ సంగీత విద్వాంసులు, కళాకారులు హాజరై తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించనున్నట్టు తెలిపారు. తొలి రోజైన 16వ తేదీన శాస్త్రీయ సంగీత కచేరీలు, 17న సంప్రదాయ నామసంకీర్తనలు, 18న హరికథా గానాలు, 19న పురంధరదాసాది కన్నడ వాగ్గేయకారుల కీర్తనల గానం, 20న భద్రాచల రామదాస, అపురూప వాగ్గేయకారుల కీర్తనలు, కృతుల గానం, 21న అన్నమాచార్య సంకీర్తనల విభావరిలు, 22న అన్నమాచార్య భక్తి భావ స్వర తరంగాలు వంటి సంగీత కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

టీకాలను సద్వినియోగం చేసుకోండి


రవికుమార్, జిల్లా పశువైద్యాధికారి

తిరుపతి అర్బన్: పాడి రైతులు టీకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా సీజనల్ వ్యాధులు వచ్చిపోతుంటాయని, ఈ సందర్భంగా చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే పశువులతోపాటు మేకలు, గొర్రెలు, కుక్కలు, కోళ్లు సైతం కాపాడుకోవచ్చని చెప్పారు. ముందుగా గొర్రెలకు వస్తున్న చిటుకు వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నామని చెప్పారు. జిల్లాకు 9 లక్షల టీకాలు వచ్చాయని, ఇప్పటికే 5 లక్షల టీకాల వరకు వేశామని వెల్లడించారు. మరోవైపు పశువులకు గొంతు వాపు వ్యాక్సిన్‌లు వేస్తున్నామని పేర్కొన్నారు. అంతేకాకుండా సేద్యం చేస్తున్న పశువులు (ఎద్దులు) జబ్బ వాపు వ్యాధులకు టీకాలు వేస్తున్నట్లు వెల్లడించారు.



బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.73,930
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.6,639
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.90,000
రిటైల్ వెండి గ్రాము రూ.92.00

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరి రూరల్: పట్టణంలోని ఏపీ మోడల్‌స్కూల్‌లో 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆ పాఠశాల ప్రిన్సిపల్ తులసి జ్యోతి శుక్రవారం పేర్కొన్నారు. ఈ మేరకు ఆసక్తి కలిగిన విద్యార్థులు శని, మంగళవారాల్లో తమ పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి జూన్ 19వ తేదీన ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

ఎంఆర్‌హెచ్‌ఆర్‌యూలో జీఐఎస్‌పై వర్క్‌షాప్


మాట్లాడుతున్న తిరుపతి ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్

చంద్రగిరి: స్థానిక టవర్‌క్లాక్ సమీపంలోని మోడల్ రూరల్ హెల్త్ రీసెర్చ్ యూనిట్ (ఎంఆర్‌హెచ్ ఆర్‌యూ) ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజారోగ్యంలో భౌగోళిక సమాచార వ్యవస్థ (జీఐఎస్) వాడకం అనే అంశంపై ఓరియంటేషన్ ట్రైనింగ్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్‌తో పాటు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ, వ్యాధులు, సేవల అందజేతపై జీఐఎస్ నిఘా, మ్యాపింగ్, వనరుల కేటాయింపు, రోగి సంరక్షణతో పాటు ఇతర వివరాల కోసం ఈ జీఐఎస్ వ్యవస్థ పనిచేస్తుందని, అందుకే ఈ వర్క్‌షాప్ పెట్టినట్టు వెల్లడించారు. జీఐఎస్ ఫండమెంటల్స్, క్వాంటం జీఐఎస్‌ను ఇన్‌స్టాల్, కో–ఆర్డినేట్ సిస్టమ్ మ్యాప్ ప్రొజెక్షన్ డేటా రకాలు, ప్రజారోగ్యంలో జీఐఎస్ అవసరం, నావిగేషన్ టూల్స్‌తో పనిచేసే డేటాను ప్రదర్శించడం తదితరాల గురించి చెన్నైలోని ఐసీఎంఆర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎపిడెమియాలజీ నుంచి డాక్టర్ శ్రీనివాసన్, వెట్రిసెల్వన్, చొక్కలింగంలు వివరించారు. ఈ వర్క్‌షాప్‌లో తిరుపతి ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ మూర్తి, ఎంఆర్‌హెచ్‌ఆర్‌యూ నోడల్ అధికారి డాక్టర్ సునీత, అధ్యాపక బృందం, శాస్త్రవేత్తలు డాక్టర్ వెన్నెల సాహితి, డాక్టర్ యూవీ. ప్రసాద్ పాల్గొన్నారు.

ఫార్మసీలో జాతీయ సెమినార్


ఎంబీయూలో డాక్టర్ శ్రీనివాస్ నందూరిని సత్కరిస్తున్న వీసీ నాగరాజ రామారావు

చంద్రగిరి: మండల పరిధిలోని శ్రీసాయినాథ నగర్‌లోని మోహన్‌బాబు యూనివర్సిటీలోని ఫార్మసీలో జాతీయ సెమినార్‌ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ సెమినార్‌కు ఎన్‌ఐపీఈఆర్ హైదరాబాద్ నుంచి డాక్టర్ శ్రీనివాస్‌నందూరి, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ నుంచి డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ విలియం కేర్రీ, బయోకాన్ ప్రైవేట్ లిమిటెడ్ బెంగళూరు నుంచి డాక్టర్ ప్రవీణ్, మోహన్‌బాబు యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ నగరాజ్ రామారావులు పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారి నైపుణ్యం, అవగాహన కోసం ఆసక్తికరమైన చర్చలు జరిపారు. కాన్ఫరెన్స్‌లో మొదటి రోజు 'డ్రగ్ డిస్కవరీ, జాతీయ, అంతర్జాతీయంగా జరుగుతున్న పురోగతులు' అనే అంశంపై చర్చించారు. ప్యానెలిస్టులు ఫార్మస్యూటికల్, మెడికల్ సైన్సెస్ రంగాల్లో ఇన్నోవేషన్స్ ప్రాముఖ్యతను, వైద్య నైతికత, ఫార్మస్యూటికల్ సైన్సెస్‌లో ఇన్నోవేషన్ అవసరంపై మేధావులతో చర్చించారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు


సినీ నటులు సాయికుమార్, ఆది సాయికుమార్


పూజల్లో మంచు లక్ష్మి, ప్రగ్యా జైస్వాల్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శుక్రవారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. ఇందులో సినీ నటుడు సాయికుమార్, ఆయన తనయుడు హీరో ఆది సాయికుమార్ ఉన్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ప్రత్యేక రాహు–కేతు పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనాలు అందించగా.. ఆలయ అధికారులు స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా ప్రముఖ నటుడు మోహన్‌బాబు కుమార్తె మంచు లక్ష్మి, హీరోయిన్ ప్రగ్యా జైస్వాల్ స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

బాలమందిరంలో ప్రవేశాలకు దరఖాస్తులు

తిరుపతి(అలిపిరి): ఎస్వీ బాలమందిరంలో 2024–25 విద్యాసంవత్సరానికి అనాథ బాలబాలికల ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు టీటీడీ డీఈఓ డాక్టర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. హిందువులుగా ఉండి 2024 జూన్ 15 నాటికి 5–10 ఏళ్ల లోపు వయస్సు కలిగి తల్లిదండ్రులు లేని అనాథ బాలబాలికలను చేర్చేందుకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. జనన, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో జూలై 5వ తేదీ లోపు స్వయంగా గాని.. తపాలాలో దరఖాస్తులను 'ఏఈవో, ఎస్వీ బాల మందిరం, టీటీడీ, భవానీనగర్, తిరుపతి–517501' చిరునామాకు పంపాలన్నారు. వివరాలకు ఫోన్ నం.0877–2264613లో సంప్రదించాలని కోరారు.

ఎన్నికలు విజయవంతం చేశాం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికలు విజయవంతం చేశామని, ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం రాత్రి తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో సక్సెస్ మీట్ పేరుతో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలను ఎప్పటికప్పుడు అమలు చేయడానికి ఆర్వోలతోపాటు అన్ని కేటగిరులకు చెందిన అధికారులు పూర్తిసహకారం అందించారని కొనియాడారు. కష్టపడి పనిచేసిన ప్రతి అధికారి, ఉద్యోగికి ఆయన అభినందనలు తెలిపారు. అనంతరం ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ చిన్నచిన్న ఘటనలు మినహా జిల్లాలో ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల్లో భాగస్వాములైన ప్రతి పోలీస్ అధికారి, ఉద్యోగికి ఆయన అభినందనలు తెలిపారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి పెంచలకిషోర్ మాట్లాడుతూ అధికారులను సమన్వయం చేసుకుంటూ ఎన్నికలను విజయవంతం చేయడానికి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ చేసిన కృషిని కొనియాడారు. తర్వాత జాయింట్ కలెక్టర్, వెంకటగిరి ఆర్వో ధ్యాన్‌చంద్ర, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, తిరుపతి ఆర్వో అదిత్‌సింగ్, తిరుపతి ఆర్డీఓ, చంద్రగిరి ఆర్వో నిషాంత్‌రెడ్డి తదితరులు ఎన్నికల సమయంలో తాము చేపట్టిన విధివిధానాలను తెలియజేశారు. బీఎల్వోల పని తీరును కొనియాడారు.

కోర్టులకు ముగిసిన సెలవులు

తిరుపతి లీగల్: రాష్ట్ర హైకోర్టు అదనపు జిల్లా జడ్జి కోర్టులకు, సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు గత నెల 13వ తేదీ నుంచి ఇచ్చిన వేసవి సెలవులు శుక్రవారంతో ముగిశాయి. శనివారం నుంచి కోర్టులు యథావిధిగా పనిచేయనున్నాయి.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లో నెల్లూరు నుంచి చెన్నై వెళ్లే మెమో రైలును ఎక్కుతూ ఓ గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తూ జారిపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. మృతుడి వయస్సు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉంటుందని రైల్వే పోలీసులు తెలిపారు. అతనికి రెండు కాళ్లు, రెండు చేతులకు బలమైన గాయాలు కావడంతో వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి దాటాక మృతి చెందాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. మృతుడు మెరూన్ కలర్, బ్లాక్ మీద సన్నటి తెలుపురంగు చారలతో కూడిన గళ్ల చొక్కా ధరించి ఉన్నాడు. మెడలో నల్లటి తాడు ఉంది. ఆచూకీ తెలిస్తే తమను సంప్రదించాలని, లేకుంటే మున్సిపాలిటీ వారికి అప్పగించి ఖననం చేయిస్తామని రైల్వే పోలీసులు చెప్పారు.

చెరువులో పడి యువకుడి మృతి

చంద్రగిరి(తిరుచానూరు): చెరువులో పడి గుర్తుతెలియని యువకుడు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తిరుచానూరు ఎస్ఐ జగన్నాథరెడ్డి వివరాల మేరకు.. సుమారు 30 నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగిన యువకుడు సప్తగిరి కాలనీ పంచాయతీ పరిధిలోని అన్నాచెరువు వద్ద మృతి చెందినట్లు సమాచారం వచ్చింది. మృతి చెంది సుమారు నాలుగు రోజులకు పైగా కావడంతో మృతదేహం గుర్తుపట్టలేనంతగా మారిపోయింది. మృతుడు మోకాళ్ల వరకు కత్తిరించిన నీలి రంగు ప్యాంటు వేసుకుని ఉన్నాడు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు తిరుచానూరు సీఐ–94407 96755, ఎస్ఐ–99595 04860 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

టైరు బండిని ఢీకొన్న లారీ

సూళ్లూరుపేట: పట్టణంలోని తారకేశ్వర జంక్షన్ రోడ్డు మలుపులో టైరు బండిని లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఓ ఎద్దు మృతిచెందింది. వివరాలు.. మన్నారుపోలూరుకు చెందిన టైరు బండి యజమాని కాళంగి నది నుంచి పట్టణంలోని పలు కట్టడాలకు ఇసుక తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో గురువారం ఉదయాన్నే ఇసుక తీసుకొచ్చి తిరిగి జాతీయ రహదారిపై వెళుతుండగా మేనకూరు సెజ్‌లోని ఒ ప్రయివేట్ కంపెనీకి చెందిన లారీ మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి టైరు బండిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎద్దుకు ఉన్న పలుపుతాడు లారీకి తగులుకోవడంతో కొమ్ములు విరిగిపోయి రక్తం కక్కుకుని చనిపోయింది. బండి తోలుతున్న యజమానికి ఎలాంటి గాయాలు తగలలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్థానిక పోలీసులు తెలిపారు.

లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు


మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న హైవే మొబైల్ సిబ్బంది

ఓజిలి: మండలంలోని జాతీయ రహదారి రాచపాళెం సమీపంలో ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఆర్టీసీ బస్సు అదుపు తప్పి ఢీకొట్టింది. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాలు.. శుక్రవారం చిత్తూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నెల్లూరు నుంచి చిత్తూరుకు బయలుదేరింది. ఈ క్రమంలో రాచపాళెం సమీపంలోకి వచ్చేసరికి ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న వెంకటేశ్వర్లు, లక్ష్మి, నిర్మల, కార్తీక్‌కి గాయాలయ్యాయి. క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే రాజుపాళెం వద్ద లారీని కారు ఢీకొంది. ప్రకాశం జిల్లాకు చెందిన శ్యామసుందర్ చెన్నైలో పనులు ముగించుకుని బయలుదేరాడు. రాజుపాళెం వచ్చే సరికి నిద్రమత్తులో ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టాడు. శ్యామసుందర్, మరో ఇద్దరికి గాయాలయ్యాయి.

జిల్లా రగ్బీ జట్టు ఎంపిక



శ్రీకాళహస్తి: బాపట్లలోని కేవీఆర్ డిగ్రీ కళాశాలలో ఈనెల 15, 16 తేదీలలో జరిగే రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు చిత్తూరు జిల్లా జట్టును శుక్రవారం ఎంపిక చేశారు. రెండో పట్టణ సీఐ రారాజు క్రీడాకారులకు టీషర్ట్‌లను అందజేశారు. ఎంపిక చేసిన జట్టులో మురళి, సాయితేజ, శ్రీనివాసులు, భానుప్రకాష్, డికేష్, అవినాష్, భరత్, జగదీష్, దినేష్, చంద్ర, శంకర్, గణేష్ ఉన్నారు. జిల్లా కార్యదర్శి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న కారును ఢీకొన్న లారీ

– మహిళకు తీవ్ర గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సులోచనమ్మ

చిల్లకూరు : దైవదర్శనం కోసం రోడ్డు పక్కన కారు నిలిపి అమ్మవారిని దర్శించుకున్నారు. తర్వాత తిరిగి నెల్లూరు వెళ్లేందుకు కారెక్కారు. ఇంతలో వెనుకనే వచ్చిన లారీ కారును బలంగా ఢీకొట్టడంతో కారు రోడ్డుపైనే బోల్తాపడింది. అందులోని ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం రైటార్ సత్రం సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాలు.. కోట నుంచి ఓ కుటుంబం కారులో నెల్లూరుకు బయలు దేరింది. జాతీయ రహదారిపై రైటార్ సత్రం వద్దకు వచ్చే సరికే ఆవలి వైపున రోడ్డు పక్కనే ఉన్న గంగమ్మ గుడికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆపై కారులో ఎక్కి కూర్చుంటుండగా వెనుకనే నాయుడుపేట నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న లారీ వేగంగా కారును ఢీకొట్టింది. కారు రోడ్డుపైనే బోల్తా పడడంతో అందులో ఉన్న నలుగురూ ఇరుక్కుపోయి అవస్థలు పడ్డారు. తీవ్రంగా గాయపడ్డ సులోచనమ్మను టోల్ ప్లాజా అంబులెన్స్ సిబ్బంది గూడూరు ఏరియా ఆస్పత్రికి.. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బోల్తాపడ్డ కారును పక్కకు తీసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

తిరుపతి అర్బన్ తహసీల్దార్‌కు వారెంట్

తిరుపతి లీగల్: భరణం కేసులో తిరుపతి ఐదో అదనపు జిల్లా జడ్జి కోర్టు, ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయనందుకు తిరుపతి అర్బన్ తహసీల్దార్‌కు వారెంట్ జారీచేస్తూ న్యాయమూర్తి రామ్‌గోపాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేసు వివరాల్లోకి వెళితే.. తిరుపతికి చెందిన జ్యోత్స్నకు తన భర్త రూపేష్‌రెడ్డి కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం భరణం చెల్లించలేదు. దీంతో భరణం సొమ్ము రూ.2.5 లక్షలు చెల్లించాలని ఆదేశాలివ్వాలంటూ కోర్టులో ఆమె పిటీషన్ దాఖలు చేశారు. అతను ఆ సొమ్ము చెల్లించకపోవడంతో అతని ఆస్తిని జప్తు చేయాలంటూ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఆ ఉత్తర్వులు తిరుపతి జిల్లా కలెక్టర్‌కు వెళ్లగా.. ఆయన తిరుపతి అర్బన్ తహసీల్దార్ ఆదేశించారు. అయితే తహసీల్దార్ ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో ఆమె తిరిగి కోర్టును ఆశ్రయించారు. తహసీల్దారుపై కోర్టు ధిక్కారం పిటీషన్ దాఖలు చేశారు. ఆ పిటీషన్‌ను పరిశీలించిన న్యాయమూర్తి అర్బన్ తహసీల్దార్‌కు వారెంట్ జారీచేస్తూ ఉత్తర్వులిచ్చారు.

ముగ్గురికి రిమాండ్

తిరుపతి లీగల్: మహిళ ఆత్మహత్య చేసుకున్న కేసులో ముగ్గురికి ఈ నెల 27వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వాణిశ్రీ శుక్రవారం ఆదేశాలు జారీచేశారు. తిరుపతి ఎంఆర్‌పల్లి శేషాద్రి నగర్‌కు చెందిన టీటీడీ తిరుమల టోల్గేట్ కౌంటర్ వద్ద ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.బాలక్రిష్ణ, తిరుపతికి చెందిన ఎం.లోకేశ్వరిని వివాహం చేసకున్నారు. అదనపు కట్నం కోసం అతను అతని తల్లిదండ్రులు ఎం.మంగమ్మ, ఎం.నాగయ్య వేధించడం మొదలు పెట్టారు. వేధింపులు భరించలేక ఆమె గత నెల 7వ తేదీ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. ఆపై తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ గత నెల 12వ తేదీన మృతి చెందారు. మృతురాలి తల్లి ఎం.వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు ఈస్ట్ డీఎస్పీ ముగ్గుర్నీ అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గూడూరురూరల్ : పట్టణంలోని కేవీ నారాయణ, టౌన్‌హాల్ సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో డీఈఈ ప్రసాద్ వెల్లడించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నాయుడుపేటలో..

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని 11 కేవీ సబ్‌స్టేషన్, పెన్నేపల్లెలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆర్.శేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రైతులు, గృహ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కండలేరులో 6.467 టీఎంసీలు

రాపూరు : కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 6.467టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 20, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీరు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సిద్ధిలేశ్వర కోన వద్ద హెచ్చరిక బోర్డులు



రాపూరు : రాపూరు–చిట్వేలి మార్గంలో వెలుగొండ అటవీ ప్రాంతంలోని సిద్ధిలేశ్వర కోన వద్ద పలు చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కోన జలపాతంలో మునగవద్దని, అక్కడి నీటి గుంతలో గుండాలు, పాకుడు పట్టిన పెద్ద రాళ్లు ప్రమాదకరంగా ఉన్నట్లు బోర్డుల్లో పేర్కొన్నారు. గత పదేళ్లలో ఈ జలపాతంలో మునిగి సుమారు 18 మంది యువకులు మృత్యువాత పడ్డారని బోర్డులో ప్రకటించారు. సరదా కోసం ప్రాణాల మీదకు తెచ్చుకుని కుటుంబీకులకు విషాదం మిగల్చవద్దని పోలీసులు, పంగిలి పంచాయతీ అధికారులు సూచించారు.

నేడు మండల మీట్

సూళ్లూరుపేట రూరల్ : పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జల జీవన్ మిషన్, జాతీయ ఉపాధి హామీ పథకం, ఇతర అభివృద్ధి పనులపై సమీక్షించనున్నట్లు వెల్లడించారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

అభివృద్ధి.. సంక్షేమమే అజెండా



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేటటౌన్ : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా ముందుకు వెళతామని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని నెలవల నివాసం వద్ద ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల హామీల అమలులో భాగంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు మెగా డీఎస్సీ, పింఛన్ల పెంపు, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు, అన్న క్యాంటీన్‌ల పునరుద్ధరణ, నైపుణ్య గణన ఫైళ్లపై సంతకం చేశారని వెల్లడించారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని, వివాదాలను ప్రోత్సహించే సంస్కృతి తమది కాదని స్పష్టం చేశారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనం భేటి విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న సూర్యనారాయణ

వెంకటగిరిరూరల్ : మండలంలోని గిరిజన కాలనీల్లో శ్రీనివాసన్ సేవా సంస్థ వారు శుక్రవారం కొబ్బరి మొక్కలు పంపిణీ చేశారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారి సూర్యనారాయణ చేతుల మీదుగా మొక్కలు అందజేశారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ మండలంలోని 14 గిరిజన కాలనీల్లో ఒక్కో కుటుంబానికి రెండు మొక్కలు చొప్పున పంపిణీ చేశామని వెల్లడించారు. ఆయా కుటుంబాల వారు మొక్కలను సంరక్షించుకోవాలని సూచించారు.

ఒకరి రక్తదానం.. మరొకరికి ప్రాణదానం

"ఒకరు రక్తదానం చేస్తే అది మరొకరికి ప్రాణం పోస్తుంది.. ఒకరు బాధ్యతాయుతంగా ఆలోచిస్తే అది సమాజంలోని మరికొందరిలో స్ఫూర్తి నింపుతుంది.. సాటివారికి మంచి చేయాలనే ఆలోచనతో ఒకరు ముందడుగు వేస్తే అది మరింత మందిని సన్మార్గం దిశగా నడిపిస్తుంది" అని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా శుక్రవారం గూడూరు.. నాయుడుపేటలో నిర్వహించిన రక్తదాన శిబిరాల్లో వారు పాల్గొన్నారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన దాతలను అభినందించారు.

- ఘనంగా ప్రపంచ రక్తదాన దినోత్సవం
- గూడూరు.. నాయుడుపేటలో బ్లడ్ డొనేషన్ క్యాంపులు



నాయుడుపేట ఆస్పత్రిలో రక్తదాన శిబిరం

గూడూరురూరల్ : పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం కామ్రేడ్ పరసా సత్యనారాయణ శత జయంతిని పురస్కరించుకుని సీఐటీయూ నేతలు రక్తదాన శిబిరం నిర్వహించారు. సీఐటీయూ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణయ్య మాట్లాడుతూ రక్తం లభించక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కరు రక్తదానం చేస్తే మరొకరి ప్రాణం కాపాడవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరు ఆరు నెలలకు ఒకసారి రక్త దానం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నారాయణ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ జోగి హరీష్, ఆటో యూనియన్ కార్మికులు శశికుమార్, కిషోర్, కల్యాణ్, పాండు, శ్రీకాంత్ తదితరులు రక్తదానం చేశారు. దాతలకు పండ్లు, జ్యూస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఆటో యూనియన్ పట్టణ సహాయ కార్యదర్శి రమేష్, అడపాల ప్రసాద్, జి.మధు, చంద్రయ్య, గుర్రం రమణయ్య, డాక్టర్ మధుసూదన్, ఆస్పత్రి సిబ్బంది మనోజ్, స్టాఫ్ నర్సులు మార్తా, కల్యాణి పాల్గొన్నారు.



రక్త దానం చేస్తున్న సీఐటీయూ నాయకులు

నాయుడు పేటలో..

నాయుడుపేటటౌన్ : ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సామాజిక వైద్య ఆరోగ్యం కేంద్రంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రకళ తెలిపారు. సీఐటీయూ, అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గూడూరు ఏరియా వైద్యశాల బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన శిబిరంలో 30 మంది రక్తదానం చేసినట్లు వెల్లడించారు. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం దాతలకు సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మహేష్, ముకుందా, అమ్మ ఫౌండేషన్ నిర్వాహకులు కృష్ణవేణి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం



నేతలతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు : వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం వాకాడులోని తన నివాసంలో ఆయన నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీని మరింత పటిష్టం చేసేందుకు కృషి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలతో మమేకమవ్వాలని సూచించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు కొడవలూరు దామోదర్‌రెడ్డి, దువ్వూరు భాస్కర్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నేదురుమల్లి హిమకుమార్‌రెడ్డి, వాకాటి రవి, దువ్వూరు భార్గవ్‌రామ్, గూడూరు వెంకటేశ్వర్లురెడ్డి, గూడూరు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా చెట్ల తొలగింపు



చెట్లు తొలగిస్తున్న జేసీబీ

దొరవారిసత్రం : డీవీ సత్రం నుంచి ఏకొల్లు గ్రామం వరకు సుమారు కిలోమీటర్ మేర రోడ్డుకు ఇరుపక్కల దట్టంగా పెరిగిపోయిన ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలను తొలగించారు. శుక్రవారం జేసీబీతో సర్పంచ్ బ్లెస్సీ సొంత నిధులు వెచ్చించి మొక్కల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. రోడ్డు పక్కన ముళ్ల చెట్లు విపరీతంగా పెరిగిపోవడంతో వివిధ కంపెనీలకు వెళ్లే బస్సుల రాకపోకలతో పాటు, ఆటో, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతుండేవారు. సర్పంచ్ స్పందించి రోడ్డు పరిసరాలను పరిశుభ్రం చేయించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గోవును రక్షించిన యువకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పురుషుల డిగ్రీ కళాశాల వద్ద శ్రీకాళహస్తి–పిచ్చాటూరు మార్గంలో ఓ గోవు ప్రమాదవశాత్తు మురుగునీటి కాలువలో పడిపోయింది. అందులో నుంచి లేవలేక ఆపసోపాలు పడింది. అటుగా వెళుతున్న యువకులు స్పందించి కర్రల సాయంతో ఆవును రక్షించారు. యువకుల మానవత్వాన్ని స్థానికులు అభినందించారు.

మలేరియా నివారణపై ర్యాలీ



జోరేపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రాపూరు : మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని జోరేపల్లెలో వేపినాపి ఆరోగ్య కేంద్రం సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ సూర్యధర్మేంద్ర మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఇళ్ల పరిసరాల్లో మురుగు నీరు నిల్వ చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమలు వ్యాప్తి చెందితే మలేరియా జ్వరాల బారిన పడే ప్రమాదముందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మురుగు నీరు తొలగించుకోవాలని సూచించారు. దోమ తెరలను తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు.

బాధ్యతగా రైతులకు అండ

వెంకటగిరి(సైదాపురం) : బాధ్యతగా భావించి రైతులకు అండగా నిలబడాలని, క్షేత్రస్థాయిలో సలహాలు అందించాలని వ్యవసాయశాఖ ఏడీఏ నాగార్జునసాగర్ ఆదేశించారు. శుక్రవారం వెంకటగిరి వ్యవసాయశాఖ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ పంటల సాగు, ఆరుతడి పంటలు, మట్టి నమూనా సేకరణ, పచ్చిరొట్ట పైర్ల సాగులో నూతన విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆర్‌బీకేల ద్వారా పంపిణీ చేస్తున్న ఎరువులు, పురుగుమందుల వివరాలను రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని కోరారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందేలా సూచనలందించాలని తెలిపారు.



మాట్లాడుతున్న ఏడీఏ నాగార్జునసాగర్

ఘనంగా అర్జున తపస్సు



తపస్సుమాను అధిరోహిస్తున్న అర్జున వేషధారి

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు అరుంధతివాడలోని శ్రీరేణుక పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మాతమ్మ కొలుపు ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో అర్జున తపస్సుమాను ఉత్సవం వైభవంగా జరిగింది. అర్జున వేషధారి తప్పస్సుమాను ఎక్కి నిమ్మపండ్లను పైనుంచి విసిరారు. వాటిని అందుకునేందుకు జనం ఉత్సాహం చూపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గౌరీదేవి ముగ్గును వేసి పూజలు నిర్వహిం చారు. గ్రామపెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్రీసిటీ ఎస్‌ఐ గౌస్ పీర్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లను చేపట్టారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

వైన్‌షాప్‌ల సిబ్బంది ఆందోళన



నిరసన తెలుపుతున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది

నాయుడుపేటటౌన్ : పట్టనంలోని ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద శుక్రవారం వైన్ షాపుల్లో పనిచేసే ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆందోళన నిర్వహించారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం కొత్తగా మద్యం పాలసీ తీసుకువస్తుందని ప్రచారం జరుగుతోందన్నారు. ఇప్పుడు నిర్వహిస్తున్న మద్యం దుకాణాలను తొలగించి, వాటి స్థానంలో పాత విధానంలో షాపులు పెట్టనున్నట్లు ప్రచారం సాగుతోందని తెలిపారు. ఒక వేళ ఈ వైన్‌షాపులను తొలగిస్తే తమ కుటుంబాలు వీధిన పడతాయని, తమను సర్కారే ఆదుకోవాలని కోరారు. ఒక్క ఓజిలి డిపో పరిధిలోని దాదాపు 580 మంది పనిచేస్తున్నారని, ప్రభుత్వం కనికరించకుంటే తాము జీవనోపాధి కోల్పోతామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి వినతి పత్రం అందించినట్లు ఔట్ సోర్సింగ్ సిబ్బంది తెలిపారు.

చిల్లకూరు సంతలో పొట్టేళ్లకు గిరాకీ

చిల్లకూరు : ప్రతి శుక్రవారం చిల్లకూరులో నిర్వహించే గొర్రెల సంతలో పొట్టేళ్లకు మంచి గిరాకీ ఏర్పడింది. ముఖ్యంగా బక్రీద్‌ను పురస్కరించుకుని వైఎస్సార్ కడప, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి రైతులు తమ గొర్రెలు, పొట్టేళ్లను సంతకు తీసుకుని వచ్చారు. ఈ తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు పెద్దసంఖ్యలో మార్కెట్‌కు తరలివచ్చారు. ఈ నేపథ్యంలో జోరుగా క్రయవిక్రయాలు సాగాయి. సుమారు 30 వేల వరకు గొర్రెలు, పొట్టేళ్ళు, మేకలు అమ్ముడైనట్లు మార్కెట్ కమిటీ అధికారులు వెల్లడించారు. ఒక పొట్టేలు మాములు రోజుల్లో రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటుందని, అయితే ఇప్పుడు రూ.15వేల నుంచి రూ.30వేల వరకు పలికినట్లు తెలిపారు. తాడేపల్లి గూడెం నుంచి వచ్చిన వ్యాపారులే దాదాపు 100 నుంచి 150 పొట్టేళ్లు కొనుగోలు చేయడంతో ఉదయం 11 గంటలకే సంత దాదాపుగా ఖాళీ అయిపోయిందని వివరించారు.



సంతలో పొట్టేళ్లు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

చిల్లకూరు : మండలంలోని తిప్పగుంటపాళెంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగిశెట్టి రేణుక మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు. పిల్లలకు ఆటపాటలతో కూడి విద్యాబుద్ధులు నేర్పించేందుకు సహకరించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులతోపాటు గర్భిణులు, బాలింతలకు చక్కటి పౌష్టికాహారం అందిస్తున్నామని వెల్లడించారు. ఇందుకోసం తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మి, ప్రభావతి పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాయిదా

వెంకటగిరిరూరల్ : పట్టణంలోని పురపాలక కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన కౌన్సిల్ సమావేశం వాయిదా పడింది. నాలుగు అంశాలతో కూడిన అజెండాతో కౌన్సిలర్ల సమక్షంలో సమావేశం ప్రారంభించగా 4, 7వ వార్డు కౌన్సిలర్లు నారి శేఖర్, చంద్రశేఖర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు కౌన్సిల్ సమావేశంపై సమాచారం అందించారా అని ప్రశ్నించారు. ఇవ్వలేదని కమిషనర్ సమాధానమివ్వడంతో ముందు ఎమ్మెల్యేకు సమాచారం అందించి సమావేశం ఏర్పాటు చేయాలని హుకుం జారీ చేశారు. దీంతో సమావేశం వాయిదా పడింది.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భానుప్రియ

తెలుసుకో.. జాగ్రత్తగా మసలుకో!

గ్యాస్ సిలిండర్‌లు వినియోగించే ముందు వాటిని పూర్తి స్థాయిలో పరిశీలించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆయిల్ కంపెనీలు సిలిండర్‌లను పూర్తి స్థాయిలో పరిశీలించిన అనంతరం గ్యాస్ నింపి వినియోగదారులకు సరఫరా చేస్తాయి. అయితే వీటికి కాలపరిమితి ఉంటుంది. సిలిండర్ సరఫరా చేసిన ప్రతి పర్యాయం వినియోగదారులు వాటి గడువు తేదీని పరిశీలించాలి. కాలపరిమితి ముగిసిన సిలిండర్ వినియోగిస్తే లీకేజీలతో ప్రమాదాలు పొంచి ఉంటాయి

- గడువు దాటితే ముప్పు తప్పదు
- వంట గ్యాస్ సిలిండర్‌కు కాలపరిమితి
- గడువు తేదీని పరిశీలించి తీసుకోవాలి
- గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి



పిచ్చాటూరు గ్యాస్ గోడౌన్‌లో సిలిండర్లు

పిచ్చాటూరు: గ్యాస్ సిలిండర్‌తో వంట చేసుకోవడం ఎంత సులభమైన పద్ధతో.. సరైన జాగ్రత్తలు పాటించకపోతే అంతే ప్రమాదం కూడా ఉంటుంది. సిలిండర్‌కు కాలపరిమితి ఉంటుందని, దాన్ని వినియోగదారులు గుర్తించాలని నిపుణులు చెబుతున్నారు. గడువు తేదీ ముగిసిన సిలిండర్‌ను వినియోగిస్తే గ్యాస్ లీక్ అయ్యే ప్రమాదం ఉంది. వంట గ్యాస్ కంపెనీలు సరఫరా చేసే ప్రతి సిలిండర్‌పై గడువు తేదీ, కోడ్ విధానంలో మెటల్ ప్లేటుపై ముద్రిస్తాయి. సిలిండర్‌ను మార్చుకున్నప్పుడల్లా ఆ గడువు తేదీని చూసుకుని వినియోగించుకోవాలి.

ఇలా గుర్తించాలి..

సిలిండర్ మెటల్ ప్లేటుపై ఏ–24, బి–24 అని ఉంటే ఆ సిలిండర్ 2024 మార్చి– జూన్‌కి గడువు ముగుస్తుందని అర్థం. 24 అంటే 2024 సంవత్సరానికి, ఆంగ్ల అక్షరం త్రైమాసికానికి సూచిక. 'ఏ'అక్షరం జనవరి నుంచి మార్చి వరకు, 'బీ' అక్షరం ఏప్రిల్ నుంచి జూన్ వరకు, 'సీ' అక్షరం జూలై నుంచి సెప్టెంబర్ వరకు, 'డి' అక్షరం అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు అని గుర్తించాల్సి ఉంటుంది.

ఎట్టిపరిస్థితుల్లో తీసుకోవద్దు..

సిలిండర్ ఇంటి వద్దకు వచ్చిన వెంటనే మెటల్ ప్లేటుపై కోడ్ విధానంలో ఉన్న గడువు తేదీని పరిశీలించాలి. గడువు తేదీ నెల వ్యవధిలో ముగుస్తున్నట్లు సిలిండర్‌పై ఉంటే దాన్ని తీసుకోకూడదు. ఎందుకంటే చిన్న కుటుంబాల వారికి నెల రోజులకు పైగా గ్యాస్ వస్తుంది. ఆ సిలిండర్ స్థానంలో వేరే సిలిండర్‌ను అడిగి తీసుకునే హక్కు వినియోగదారుడికి ఉంది.



గోడౌన్ నుంచి డెలివరీకి..

సిలిండర్‌కు పదేళ్ల గడువు..

సిలిండర్ తయారైనప్పటి నుంచి పదేళ్ల వరకు గడువు ఉంటుంది. సిలిండర్‌ను ప్రత్యేకమైన ఉక్కుతో.. సిలిండర్ లోపల సురక్షితమైన కోటింగ్‌తో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ప్రమాణాల మేరకు తయారు చేస్తారు. బీఐఎస్ అనుమతులు తీసుకున్న తర్వాతే సిలిండర్ మార్కెట్‌లోకి వస్తుంది.

వినియోగదారుని హక్కులు..

వినియోగదారుడు మృతి చెందితే వారి కుటుంబసభ్యుల పేరిట ఆ కనెక్షన్‌ను మార్పు చేసుకోవచ్చు.

కొత్త కనెక్షన్ కోసం నిబంధనల మేరకు ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే అదే రోజు కనెక్షన్ పొందవచ్చు. కొత్త కనెక్షన్ తీసుకునే సమయంలో తమ వద్దనే స్టౌ కొనుగోలు చేయాలని డీలర్ కోరవచ్చు.

డీలర్ వద్దనే కొనుగోలు చేయాలనే నిబంధన ఏమీ లేదు.

గ్యాస్ ఏజెన్సీ నుంచి 5 కిలోమీటర్ల పరిధిలోని వినియోగదారులకు సిలిండర్ ఉచితంగా డోర్ డెలివరీ చేయాలి.